# హెచ్చుతగ్గులు

చెరువుగట్టున కూర్చున్నాను. చల్లని గాలి మెల్లగా వీస్తోంది. ఎండాకాలంలో ప్రాణానికి చల్లదనం చేకూర్చే సాయంకాలం ఎంత బాగుంటుంది! యెంత హాయిగా యెంత మనోహరంగా వుంటుంది! నలువైపులా బూడిదరంగులో ముంచెత్తబడిన పర్వతాలు! పశ్చిమాన సూర్యభగవానుడు తన మిగిలిన బంగారాన్ని పంచిపెడుతూ తన ప్రియురాలైన సంధ్యాదేవితో వీడ్కోలు పుచ్చుకోబోతున్న ఆ ఘట్టం! తూర్పున చతుర్దశి చంద్రుడు తన శీతల కిరణాలను లోకంపై ప్రసరింప చేయటానికి పడే తహతహ! బిడ్డలకు ఆకలవుతోందేమో నన్న ఆత్రుతతో గూళ్ళలో మేతతో పక్షుల సమూహాలు! ప్రకృతి ఎంతో రమణీయంగా వుంది. కాని ఎంతమంది ప్రకృతి రమణీయతను చూచి ఆనందిస్తున్నారు? రమ్య ప్రకృతిని చూచేందుకుగాని, ఆలోచించేందుకుగాని వీల్లేని నిర్భాగ్యులు ఎంతమంది- బండి యెద్దుల్లాగా తిరుగుతూ తింటూ. అంతే! జీవితంలో ఏ చిన్న విషయాన్ని గూర్చి కూడ ఆలోచించేందుకు తీరికేది? ఈలాగే చెరువుగట్టుపైన కూర్చుని లోకం తీరు తెన్నుల్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. చేతిలో సిగరెట్ కాలి కాలి వ్రేలు చురుక్కుమంటే తిరిగి నా వూహా జగత్తునుండి వాస్తవ జగత్తుకు దిగాను. లేచి గట్టుపైన పచార్లు చేయటం ప్రారంభించాను. దూరంగా సుమారు ఒక వంద కూలీలు రాళ్ళు కొట్టుతున్నారు. తిన్నగా అచోటికి దారితీశాయి నా కాళ్లు. కూలీలు అలసట పోయ్యేందుకేమో 'ఓ' కొడుతూ రాళ్ళను తమతమ సుత్తెలతో ముక్కలు చేస్తున్నారు. కూలీలందరికీ ఆ చల్లని సాయం సమయంలోకూడా ఫాలభాగాన చెమట బిందువులు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. పెదవులు బిగించి శక్తినంతా తమ చేతుల్లోకి కూడ గట్టుకొని రాళ్ళను ముక్కలు చేస్తున్నట్లు స్పష్టంగా గ్రహించవచ్చు. ఆవందముఖాల్లో ఏదికూడా నేను ఆనందించిన ప్రకృతిని కనీసం చూచినట్టే లేదు! ఇంకేం ఆలోచిస్తారు? ఒకరి ముఖానకూడా నవ్వు కాదు-కనీసం చిరునవ్వు కూడ లేదు. వాళ్లకు హృదయాలున్నాయో లేవో! అవును కమనీయ ప్రకృతిని ఆరాధించే హృదయాలు లేవు వారికి. సమాజం మానవుల్ని మానవులుగాకుండా చేసింది. ప్రక్కనే ఒక టెంటు, చిన్నది. శుభ్రంగావుంది. పెద్ద రౌండుటేబుల్ సగం స్థలాన్ని ఆక్రమించింది. టేబుల్ చుట్టూ నాలుగు కుర్చీల్లో నలుగురు పెద్ద మనుషులు కూర్చుని పేకాడుతున్నారు. విలువగల సిగరెట్లు ఒకదానివెంట ఒకటి కాల్చి పారేస్తున్నారు. హుషారుగా కేళాకోళాలతో ఆట సాగుతోంది. ఒక్కొక్కడి ముందర గుప్పెడు నోట్లున్నాయ్ చెల్లాచెదరుగా. కూలీలతో పనిచేయించే కంట్రాక్టర్లు.

బట్టతల కంట్రాక్టర్ లేచాడు. "ఒక నిముషం వుండండి. కూలీల్ని హెచ్చరించి వస్తా" రెండడుగులు వేసి తిరిగి "ఆట సాగనిచ్చేకోయ్! ఒక్కనిమిషం" అంటూ తొందరగా కూలీలవైపు వచ్చాడు.

"ఏయ్! మీకేవోయ్. ప్రొద్దుగూడ క్రుంకవచ్చింది. ఇంకా నేనిచ్చిన కుప్పలో రాళ్ళు అన్ని వున్నాయేం?" గద్దించాడు కూలీల్ని.

మనుష్యులతో మనుష్యుడు మాట్లాడినట్లు లేదు. కనీసం షాహుకార్లు తమ కుక్కలతోకూడ మాట్లాడినట్లులేదు.

"చేస్తున్నాం సోమీ!" ఒక కూలీకంఠం కదిలింది.

"ఆకుప్ప పూర్తిగాకుంటే యీదినం



అర్థరాత్రయినా మీరు యిండ్లకు పోలేరు." ఆజ్ఞాపించాడు బట్టతలకంట్రాక్టర్.

"ఏం! నేను చెప్పింది అర్థమయిందా? మీకే"

కూలీలు తలలు వూచారు. సుత్తెలదెబ్బలు చురుగ్గా సాగుతున్నాయ్. టక్, టక్, టక్.

నేనూ ఒక వంక నిలుచుని చూస్తున్నానీ దృశ్యమంతా. మానవునికీ మానవునికీ ఎంత భేదముంది? ఆ టెంటులో వుండే జీవాలూ మనుష్యులే! ఈ రాళ్లుకొట్టే వారూ మనుష్యులే! కాని టెంటులోని వారు కంట్రాక్టర్లు. రాళ్ళను కొట్టేవారు కూలీలు. కంట్రాక్టర్లు చేసేదేమిటి! కంట్రాక్టర్లవి రూపాయలు! ఆ రూపాయలతో యీ కూలీలను-కాదుకాదు-వీరి శ్రమను-కొంటారు. కూలీలతో యిష్టమొచ్చినంతా పనిచేయించుకొంటారు. కాని తమ కిష్టమైనంతే కూలివారి ముఖాన కొట్టారు.

## శ్రీ బి. నాదమునిరాజు

ఏమిటీ సమాజంతీరు? శ్రమ ఒకరిది; ఫలం ఒకరిది.

'అయితే వారు రూపాయలు పెట్టుబడి పెట్టలేదా?' నా హృదయంలోని ఏదో భావం నన్ను ప్రశ్నించింది.

అవును. రూపాయలు పెట్టారు. ఆ రూపాయ లెక్కడనుంచి వచ్చినాయ్. కూలీల శ్రమశక్తి వల్ల సంపాదించిందే గదూ! వారి ముందటి శ్రమశక్తే సాహుకార్లకు రూపాయలయి, అవే నేడు యితోధికంగా కూలీలనే తిరిగి పీడిస్తున్నాయ్. ఈలాగే కాలచక్రంలాగు ఒకవిషమచక్రం సాగిపోతోంది- కూలీలలో వర్గచైతన్యం వచ్చి తమ శ్రమకు తగిన ఫలం అనుభవించే వరకు. నా ఆలోచనలు సాగిపోతున్నాయి తరంగాలు తరంగాలుగా.

కూలీల సుత్తిపోట్ల వేగం హెచ్చింది. టక్-టక్-టక్-టక్-టక్.

నేను మెల్లగా కూలీల దాపుకు పోయినా. ఎవరూ, వాళ్ళను తగిలేంత దగ్గరలోకి పోయినా నావైపు చూడలా. ఒక కూలిమాత్రం చూసీ చూడనట్టు చూసి తిరిగి తల వంచుకుని రాళ్ళు కొట్తున్నాడు.

ఆ కూలివద్దకే వెళ్లాను. వీపుమీద చేయి వేసి

"నీకెంత కూలి యిస్తారు? అన్నా" అన్నాను.

"అన్నా!" నావంక చూచి ఒకక్షణం నివ్వెర పోయినాడు ఆ కూలి. తెల్లటి బట్టలు వేసుకుని టిప్‌టాప్‌గావుండే ఎవరూ అతన్ని ఎప్పుడూ 'అన్నా' అని సంబోధించటం ఎరగనివాడులావున్నాడు.

"నేనడిగేది నిన్నే మిత్రమా! ఏం పలుకవేం?"

సంకోచిస్తూ ఒకసారి నావంక చూచి తల వంచుకొని రాతిని కొట్తూ "ఒకరూపాయి." అన్నాడుఆ కూలి

'ఒకరూపాయ' తిరిగి వుచ్చరించా. ఎన్నిగంటలు పనిచేస్తావ్?"

"ఎన్నిగంటలో! ప్రొద్దున్నుండి ప్రొద్దుగూకే వరకు" మామూలుగానే చెప్పాడు

"హూ" అన్నా.

"మీయింట్లో ఎంతమంది వున్నారు?"

"ఎనిమిదమంది"

"ఇంకా ఎవరైనా సంపాదించే వారున్నారా?"



రు 1000 బహుమానం

## లెప్రర్ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్ఠు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

## లక్ష్మి అండ్ కో

(రిజిష్టర్డు)

H. O. వాల్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే, మదరాసు.

గాంధినగర్, విజయవాడ.

కటక్, సికింద్రాబాదు,

రాజమండ్రి etc.



ఒక గంటలో యౌవ్వనము

## కామ స్తంభన

ధాతుపుష్టి. సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. నిరాశచెందిన వృద్ధులయందు శక్తి. ఉత్సాహము నిచ్చును రు. 2-8-0

మదన మంజరి ఫార్మసీ

184, చైనా బజారురోడ్డు, మద్రాసు. బెజవాడ-శ్రీనివాస మెడికల్ హాల్, పార్కు రోడ్డు. రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు. నెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ.



## నారసింహ లేహ్యము



బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

డి. సి. వి. & కంపెనీ. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి-నెల్లూరు జిల్లా.


"లేరు. అమ్మానాయన ముసలివాళ్లు."

"నీ భార్యో!"

"సన్న బిడ్డతల్లి"

"బిడ్డ లెంతమంది ?"

"నలుగురు"

"ఈ రూపాయితో సంసారం ఎలా గడుస్తుంది ?"

"............"

నా ప్రశ్న అతని ముఖంలో ఏదో విషాద ఛాయల్ని రేపినట్లుంది. 'అవును రూపాయతో ఎల్లా గడుపుతున్నానో' అనే భావం అతని ముఖంలో కనుపించి నట్లు నాకు బాగా అర్థమయింది. మానవుల్లో చాలమంది కష్టాలు పడుతూనే వుంటారు. కాని ఆ కష్టాల్ని ఎవరయినా జ్ఞాపకంచేస్తే వణికిపోతారు. తామేమో ఆ కష్టాల్ని గూర్చి ఆలోచిస్తూవుంటారు కూడా. అదే వణుకు, భీతాహం ఆ కూలి ముఖంలో నాకు స్పష్టంగా కనుపించింది.

అలాగే అయిదారుమంది కూలీలను కలిసి మాట్లాడా. వారి పరిస్థితులు హృదయ విదారకంగా వున్నాయి. ఒక కూలి కొడుకు చచ్చేంత జబ్బులో చావుమంచంలో వున్నాడట మూడురోజుల్నుంచి. కనీసం డాక్టర్ చేత మందుకూడ యిప్పించ లేక పోతున్నాడట. ఇంకొకడిభార్య తను తినకుండా బిడ్డలకు, భర్తకే పెట్టి, తను తిన్నానని అబద్ధాలాడి పూటలతరబడి వస్తుండి, జ్వరంతో మొన్ననే చనిపోయిందట. జ్వరమనే చెప్పాడు ఆ కూలి. కాని ఆలోచిస్తే అదేమి జ్వరమో అర్థమవుతుంది. ఆకలి జ్వరమది. అవును ఆకలిచావు. ఈలాగే వారి పరిస్థితులు వింటోంటే ఆ సుత్తి దెబ్బలు రాళ్ళమీద పడేవి నా హృదయానికి తగిలినట్లున్నాయ్. ఎదుగూ బొదుగూ లేని యీ జీవాల జీవితాలు యీలాగే సాగిపోవాల్సిందేనా? పరిష్కార మార్గంలేదా ? అని ఆలోచించే నాకు కంట్రాక్టర్ల వికవికలు పకపకలు వినిపించాయ్. అటు తిరిగి వెళ్లుతున్నా.

"ఆసు వచ్చిందోయ్. అందుకే అంత పట్టుకొట్టింది" నవ్వుతున్నాడు బట్టతల కంట్రాక్టర్.

మిగిలిన ముగ్గురూ ఆ కంట్రాక్టర్ నవ్వులో శ్రుతికల్పారు.

నేను లోపలికి అడుగుపెట్టా. 'కూర్చోండ' న్నారు అంతా ఒక్కసారిగా. నేనూ లేని చిరునవ్వు పెదవులపైకి తెచ్చుకుంటూ కుర్చీలో కూలబడ్డాను.

"ఎప్పుడూ రానివారు ఏం యీలా బయలుదేరారే !" అడిగాడొక కంట్రాక్టర్.

"ఆ...ఏమీలేదు. ఏదో చల్లగాలికి. వాహ్యాళివచ్చి యిలాగ వచ్చాయీ పని చూదామని" యదాలాపంగా అన్నాను.

"ఏంపనిలేండి. ఏదో కరువుకాలం ప్రజలంతా తిండికి గుడ్డకు లేక అల్లాడుతోంటే, మేమే యీ కాంట్రాక్టు తీసుకుని పనిచేయిస్తున్నాం" అన్నాడు బట్టతల కంట్రాక్టర్.

వూ కొట్టాను.

"కూలీలకు విశ్వాసం లేదండి. సోమరిపోతులు! వూరికే చేసినట్లు నటన మాత్రం చేస్తుంటారు. పని తెమల్నీరు." చెప్పుకు పోతున్నాడు.

"లేకపోతే యీ పాడు రోజుల్లో వాళ్ళ శ్రేయస్సుకోసం ఎనిమిది వేలకు కంట్రాక్టు తీసుకొని మేమూ వారితోపాటు ఎండలో చస్తూంటే విశ్వాసంకూడ లేకుండావుంటే ఎల్లాగండి ?"

"ఎంతకూలి యిస్తారండీ?" ప్రశ్నించా.

"అందరు కంట్రాక్టర్లు ముప్పావలా యిస్తారు. మేము రూపాయ యిస్తున్నాం. ఈ కాంట్రాక్టులో మాకేం లాభంలేదండి. అసలు మేము నలుగురం యిక్కడ కాచుకొని ఉన్నందుకు కూలికూడ పడదు."

"అల్లాగా" అని ఆ నలుగురు మహాశయులవద్ద శెలవు పుచ్చుకొని యింటికి బయలుదేరా. నా మెదడంతా ఆ చెరువుగట్టున కూలీల్ని గురించే ఆలోచిస్తోంది....

భోజనం ముగించుకొని ఆరు బయట వెన్నెల్లో పడుకున్నాను. లేతమరకతవర్ణపు ఆకాశం చూచేకొద్దీ ఆహ్లాదకరంగావుంది. ప్రజల మేలును కాంక్షించే ప్రభుత్వం వలె వెన్నెల ప్రజలకు హాయిని కొల్పుతోంది. చల్లని మందమారుతం హాయిగా వీస్తోంది. కాని చెరువుగట్టు కూలీలు నా హృదయంలోనుంచి కదలనందున నాకు ప్రకృతి మధురిమ ఏమాత్రం నచ్చలేదు. ఎప్పుడు సర్వజనులు ప్రకృతి చూచి ఆనందించేది ? ఆలోచించేది ? ప్రజల ఆర్థిక పరిస్థితి బాగుపడాలి; అందరూ సుఖంగా వుండాలి. అని ఆలోచన చేస్తూ కన్నుమూశాను. ★